సాక్షి
జనగామ

సోమవారం | 11 | డిసెంబర్ | 2023



ఓట్లు వేయలేదని...

శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేయలేదనే కోపంతో చిల్పూరులోని గుట్టకింద అంగడిలో స్తంభాలకు వీధిలైట్లు తొలగించారని స్థానికులు వాపోయారు. - 8లో▸



కంది..రంది

ప్రస్తుతం కంది పంటలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాలతి వివరించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/16^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. వాతావరణం చల్లబడి మంచు కురుస్తుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పొన్నాలతో పల్లా భేటీ



జనగామ: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పల్లా ఆయన నివాసానికి వెళ్లగా, ఇరువు ఒకరికొకరు సన్మానించారు. అనంతరం పార్టీకి సంబంధించిన అంశాలపై మాట్లాడుకున్నారు.

14న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ: ఈ నెల 14న బాలబాలికలకు జనగామ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ది వెంకట్‌నారాయణగౌడ్, గంగిషెట్టి మనోజ్‌కుమార్‌లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికై న వారు గుజరాత్‌లో జరిగే జాతీయ, అంతర్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 14 నుంచి 16 సంవత్సరాల లోపు బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9885046437 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా ముగిసిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష


జనగామ: ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులు చదువు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా విద్యాధికారి కె.రాము తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు 593 మంది ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ధర్మకంచ జెడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాల, ఘన్‌పూర్‌లో జెడ్పీఎస్ఎస్ బాలికల, శివునిపల్లి జెడ్పీఎస్ఎస్ మొత్తం నాలుగు సెంటర్లను కేటాయించినట్లు తెలిపారు. మొత్తంగా నాలుగు సెంటర్లకు గాను 593 మంది విద్యార్థులకు 582 మంది హాజరయ్యారని, 11 మంది గైర్హాజరయ్యారన్నారు. మెంటల్ ఎబిలిటీ, స్కాటిస్టిక్ అప్టిట్యూడ్ విభాగాల్లో పరీక్ష నిర్వహించారన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారని, ఐదేళ్ల పాటు ఉపకార వేతనం అందించి ప్రోత్సహిస్తారన్నారు.

బాలికలకు కరాటే శిక్షణ శిబిరం



స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డ్రంకెన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాలికలకు ఉచిత కరాటే శిక్షణ అందించనున్నట్లు సీనియర్ కరాటే మాస్టర్ పెసరు సారయ్య తెలిపారు. డివిజన్ కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రోజురోజుకు సమాజంలో బాలికలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయన్నారు. బాలికలు ఆత్మవిశ్వాసంగా ఉండేందుకు, దాడులను ఎదుర్కొనేలా ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సెల్ఫ్ డిఫెన్స్, కటాస్, స్పారింగ్, జిమ్నాస్టిక్, ఇండియన్ స్టిక్, నాన్‌చాక్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 98664 15312 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు మాజీ ఎంపీటీసీ గోనెల ఉపేందర్‌ముదిరాజ్, పొదల రాజేష్, పొన్న శివ, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకుసాగాలి



కాజీపేట అర్బన్: సమస్యలు ఎదురైనప్పుడు ఆత్మహత్యలకు పాల్పడకుండా మనోధైర్యంతో ముందుకుసాగాలని సీడబ్ల్యూసీ చైర్మన్ అన్నమనేని అనిల్‌చందర్‌రావు తెలిపారు. ఆత్మహత్యల నివారణపై హన్మకొండ సుబేదారిలోని బాల రక్షభవన్‌లో ఆదివారం ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆరోగ్య మిత్ర అందిస్తున్న సేవల ద్వారా 28 మందిని ఆత్మహత్యల నుంచి కాపాడడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు దామోదర్, సుధాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రకంపనలు

ఎన్పీడీసీఎల్‌పై సర్కారు నజర్?!

- 2014–15 నాటికి రూ.4,137 కోట్ల అప్పులు
- ప్రస్తుతం రూ.15,416 కోట్లకు చేరిన వైనం
- రంగంలోకి ఇంటెలిజెన్స్ అధికారులు
- ప్రభుత్వం మారగానే సీఎండీ రాజీనామా..
- ఆగమేఘాల మీద అగ్రిమెంట్లు
- కంపెనీ పరిధిలోని టెండర్లు, కాంట్రాక్టర్ల పనుల వివరాల సేకరణ
- కీలకంగా మారిన రిటైర్డ్ అధికారులు..
- ఇంటెలిజెన్స్ ఆరాపై ఉద్యోగుల్లో చర్చ



సాక్షిప్రతినిధి, వరంగల్: విద్యుత్ సంస్థల లావాదేవీలు, ఆదాయ వ్యయాలు, అవకతవకలను కొత్త ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం ఆ శాఖ ఉన్నత వర్గాల్లో కలకలం రేపుతోంది. రాష్ట్ర రాజధానిలో మొదలైన విద్యుత్ ప్రకంపనలు ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్పీడీసీఎల్)ను తాకాయి. 2014–15 నాటికి ఎన్పీడీసీఎల్‌కు రూ.4,137 కోట్లు అప్పులు ఉండగా.. ప్రస్తుతం అవి రూ.15,416 కోట్లకు చేరాయి. కాగా కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కంపెనీ పరిధిలో పరిపాలన, లావాదేవీలపై కూడా దృష్టి సారించడమే కాకుండా రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలను రంగంలోకి దించినట్టు సమాచారం. వరంగల్ కేంద్రంగా ఉన్న కార్పొరేట్ కార్యాలయం పరిధిలో వ్యవహారాలు, సుమారు ఆరేడేళ్లలో జరిగిన లావాదేవీలు ఆదాయ, వ్యయాలపై సర్కారు దృష్టి పెట్టింది. ఇదిలా ఉండగా.. ఈనెల 5న అన్ని శాఖలతో సంబంధాలుండే ప్రజాసంబంధాలకు సంబంధించిన ఓ కీలక పోస్టులో ఒకరిని నిబంధనలకు విరుద్ధంగా ఔట్ సోర్సింగ్ కింద నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయడంపై కూడా చర్చ జరుగుతోంది.

టెండర్లు, కాంట్రాక్టులు, పనులపై ఆరా..

ఎన్పీడీసీఎల్ పరిధిలో జరిగిన రూ.కోట్లాది రూపాయల విలువ చేసే పనులు.. టెండర్లు, కాంట్రాక్టర్ల వ్యవహారంపై నిఘా సంస్థలు ఆరా తీస్తుండటం చర్చనీయాంశం అవుతోంది. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన(డీడీయూజీజేవై), ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ స్కీం(ఐపీడీఎస్) తదితర పథకాలతో పాటు వివిధ స్కీంలు, గ్రాంట్ల కింద వేల కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, పంపిణీకి సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈనిధులు కేటాయించాయి. వీటితోపాటు ఇతర పథకాల కింద రూ.5 లక్షల లోపు అంచనా వ్యయంతో నామినేషన్ పైన కేటాయించిన పనుల్లో ఎక్కువ శాతం అధికారుల బినామీ కాంట్రాక్టర్లే చేజిక్కించుకున్నారని తెలుస్తోంది. కంపెనీలో కీలకంగా వ్యవహరిస్తున్న వారి బంధువులు, కుమారుల స్నేహితులు, వారి మిత్రులకు ఎక్కువ సంఖ్యలో పనులు దక్కినట్లు సమాచారం. దీంతో ఏళ్ల తరబడి ఎన్పీడీసీఎల్ పనులపై ఆధారపడిన పలువురు కాంట్రాక్టర్లు తాజా పరిణామాల నేపథ్యంలో ఇతర విభాగాలను చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలకు ముందు కేటాయించిన చాలా పనుల అగ్రిమెంట్లు.. ఆగమేఘాల మీద ఈనెల 3వ తేదీ నుంచి 9 వరకు చేసినట్లు సమాచారం. ఇంకా అగ్రిమెంట్లు జరుగుతున్నట్లు ఆ శాఖలోని కొందరు అధికారులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ పనులకు సంబంధించిన సమాచారం ఉన్నా.. వివరాలు, కేటాయించిన నిధులు, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల వివరాలు అధికారికంగా రాబట్టే పనిలో నిఘా వర్గాలున్నట్లు తెలిసింది.

పదవీ విరమణ పొందినా.. కీలక పదవుల్లోనే..

పదవీ విరమణ పొందినప్పటికీ గత ప్రభుత్వం పలువురు అధికారులను ఉన్నత స్థాయి పదవుల్లో ఏళ్లతరబడిగా పని చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ సమయంలో జరిగిన లావాదేవీలపైనా నిఘావర్గాలు దృష్టి సారించాయి.

- హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన అన్నమనేని గోపాలరావు 1969లో ఏపీఎస్ఈబీలో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరి చీఫ్ ఇంజనీర్ స్థాయికి ఎదిగారు. ఏపీఎస్ఈబీ, ఏపీఎన్పీడీసీఎల్‌లో వివిధ కేడర్లలో 34 సంవత్సరాలు పనిచేసి 2003లో చీఫ్ ఇంజనీర్‌గా పదవీ విరమణ చేశారు. 2016 అక్టోబర్ 20న మొదటి సారి ఎన్పీడీసీఎల్ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రెండోసారి 2019లో అన్‌టిల్ ఫర్‌దర్ ఆర్డర్‌తో కాల పరిమితి పొడిగించగా.. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో 6న రాజీనామా చేశారు.
- ఏపీఎస్ఈబీ, ఏపీట్రాన్స్‌కో, టీఎస్ఎన్పీడీసీఎల్‌లో వివిధ కేడర్లలో 29 సంవత్సరాలు పనిచేసి 2007లో చీఫ్ ఇంజనీర్‌గా పదవీ విరమణ చేసిన బి.వెంకటేశ్వర్‌రావు.. 2009 ఏప్రిల్‌లో మూడు సంవత్సరాల కాలపరిమితితో నియామకమయ్యారు. 2012 నుంచి 2015 వరకు రెండు పర్యాయాలు, 2015 నుంచి 2018 వరకు మూడుసార్లు పొడిగించగా.. 2019 మే నుంచి 'అన్‌టిల్ ఫర్‌దర్ ఆర్డర్'తో కొనసాగుతున్నారు.
- ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఉన్న పి.గణపతి 2006 మే నెలలో మొదటిసారి డైరెక్టర్‌గా నియామకమై 2009 మే వరకు కొనసాగారు. 2009 అక్టోబర్‌లో మరోసారి నియామకమై 2011 అక్టోబర్ వరకు కొనసాగారు. తిరిగి 2018 సెప్టెంబర్‌లో 'అన్‌టిల్ ఫర్‌దర్ ఆర్డర్'తో నియామకమై కొనసాగుతున్నారు.
- పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి కమర్షియల్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్లుగా 2018 సెప్టెంబర్‌లో 'అన్‌టిల్ ఫర్‌దర్ ఆర్డర్'తో నియామకమై కొనసాగుతున్నారు. వీరితో పాటు మరికొందరి నియామకాలపైనా ఇంటలిజెన్స్ ఆరా తీస్తోంది.

అభివృద్ధి చేసి చూపిస్తాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

- నిత్యం అందుబాటులో ఉంటాం..
- పాలకుర్తి ప్రజల రుణం తీర్చుకుంటాం
- ఎమ్మెల్యేగా గెలిచాక మొదటిసారి పాలకుర్తికి యశస్వినిరెడ్డి
- సోమేశ్వర ఆలయంలో పూజలు, విజయోత్సవ ర్యాలీ



దేవరుప్పుల: కోలుకొండలో అభివాదం చేస్తున్న యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించిన పాలకుర్తి ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. అందరికి అందుబాటులో ఉంటూ.. వచ్చే ఐదేళ్లలో మునుపెన్నడూ లేనంత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటిసారి యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఆదివారం పాలకుర్తికి వచ్చారు. ముందుగా సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం చేసి, స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమేశ్వర ఆలయం నుంచి రాజీవ్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ చౌరస్తాలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం, ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహించిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు 15 సంవత్సరాల్లో చేయని అభివృద్ధిని వచ్చే ఐదేళ్లలో చేసి చూపిస్తానన్నారు. రాజకీయ నేపథ్యం లేని తమ కుటుంబాన్ని ఇక్కడి ప్రజలు అండగా నిలిచారన్నారు. అధికార బలంతో ఎర్రబెల్లి ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేసుకుని కంటతడి పెట్టారు. అర్హులైన ప్రతిఒక్కరికి 6 గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. తనను గెలిపించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య,షేక్ బందగీల స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. ఎర్రబెల్లి ఓటమితో పాలకుర్తి ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, హమ్యనాయక్, నాయకులు లక్ష్మీనారాయణ నాయక్, నెహ్రూనాయక్, కాకిరాల హరిప్రసాద్ రావు, నిరంజన్‌రెడ్డి, గిరగాని కుమారస్వామి, సురేష్‌నాయక్, పెద్ది కృష్ణమూర్తి, గంగు కృష్ణమూర్తి, బార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

కోలుకొండలో ఘన స్వాగతం

దేవరుప్పుల: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారిగా నియోజకవర్గానికి వచ్చిన యశస్వినిరెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘన స్వాగతం పలికారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లె క్రాసింగ్ వద్ద మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు నల్ల సత్యనారాయణ, ఎంపీటీసీ రమ, దామెర అనిల్, సజ్జన్, గణేష్, వడ్లకొండ తార, మాలతి, నాయకులు పాల్గొన్నారు.

తొర్రూరులో..

తొర్రూరు: ఆదివారం రాత్రి తొర్రూరుకు చేరుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. మండలకేంద్రం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్లు తూనం రోజా, గజానంద్‌లు గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కాకిరాల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకు అతీతంగా చేపడుతున్న ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ చైర్మన్, జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నూతనంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.10లక్షల ఆరోగ్య శ్రీ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఘన్‌పూర్‌లో ఆర్డీఓ వాసం రామ్మూర్తితో కలిసి జెడ్పీటీసీ ఆదివారం ప్రారంభించారు. ముందుగా స్థానిక బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించే మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.10 లక్షల ఆరోగ్య శ్రీ పథకానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల పక్షపాతికి పలు సంక్షేమ పథకాలను చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసం రామ్మూర్తి, డీఆర్డీఓ మొగులప్ప, ఎంపీపీలు కందుల రేఖ, మేకల వరలక్ష్మీ, సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఎంపీటీసీ గన్ను నర్సింహులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వరంగల్–1 డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధీర్, టీబీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మల్లిఖార్జున్, వైద్యులు డాక్టర్ ప్రసన్నక్రిష్ణ, డాక్టర్ అజయ్, శంకర్, వీరాంజనేయులు, జనార్దన్, సౌక్య, మానస పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల వాగ్వాదం

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం ప్రారంభ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆర్డీఓ రామ్మూర్తి, జెడ్పీటీసీ మారపాక రవి, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్ ఎంపీపీలు వరలక్ష్మీ, రేఖ ప్రారంభించారు. ఈ క్రమంలో రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మీ జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేయగా అక్కడే ఉన్న ఘన్‌పూర్ ఎంపీటీసీ నర్సింహులు జై బీఆర్‌ఎస్ అంటూ నినాదాలు చేశారు. ఇది అఫీషియల్ కార్యక్రమం అని ఎవరూ నినాదాలు చేయొద్దని అధికారులు చెప్పినా వినకపోవడంతో కార్యక్రమాన్ని అర్థాంతరంగా ముగించారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



ఆర్టీసీ బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న కొమ్మూరి

బచ్చన్నపేట: రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటిని అమలు చేస్తామని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలను ప్రారంభించారు. జనగామ ఆర్డీఓ మురళీకృష్ణతో కలిసి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య శ్రీ రూ.10 లక్షలకు పెంపుదల పథకాన్ని, మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి లోటు రాకుండా అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. బస్సులో కొంత దూరం అధికారులు అందరూ కలిసి ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి అధికారి వినోద్‌కుమార్, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, ఆర్టీసీ జనగామ అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, ఆస్పత్రి సూపరింటెండెంట్లు సుగుణాకర్ రాజు, శ్రీనివాస్, మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఎంపీటీసీలు నల్లగోని పుష్ప, అల్వాల రాధ, నాయకులు బాలకిషన్‌గౌడ్, ఎల్లయ్య, మహాత్మాచారి, రమేష్, సిబ్బంది ఇరుమల్ల రాజు, కనుకయ్య, రహీం, ఆసుపత్రి సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

15న బాలగోపాల్ ఎండోమెంట్ లెక్చర్

కేయూ క్యాంపస్: మానవ హక్కుల నేత దివంగత డాక్టర్ కె.బాలగోపాల్ 13వ ఎండోమెంట్ లెక్చర్ ఈనెల 15న ఉదయం 11 గంటలకు కాకతీయ యూనివర్సిటీ కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. 'మానవహక్కులు–ప్రజాస్వామ్యం' అనే అంశంపై మానవహక్కుల యాక్టివిస్టు, విశ్రాంత హిస్టరీ అధ్యాపకుడు ఎ.చంద్రశేఖర్ స్మారకోపన్యాసం చేయనున్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

జెడ్పీ ఎవరికీ?

- జిల్లా పరిషత్ చైర్మన్ మృతితో గందరగోళం..
- బీఆర్‌ఎస్‌లో కొత్త బాస్‌పై చర్చ



జనగామ జిల్లా పరిషత్ కార్యాలయం

జనగామ: జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్‌ఎస్ డిస్ట్రిక్ అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి హఠాన్మరణం ఆ పార్టీలో తీవ్ర విషాద ఛాయలు నింపాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పార్టీ కేడర్‌ను సమన్వయం చేస్తూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగినా.. జనగామలో మాత్రం గులాబీ జెండా రెపరెపలాడింది. ఇందుకు సంపత్‌రెడ్డి చేసిన కృషిని కేడర్ నేటికి గుర్తుకు చేసుకుంటుంది. జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రెండు పదవులతో ద్విపాత్రాభినయంతో ప్రతి ఒక్కరితో శభాష్ అనిపించుకున్న పాగాల.. తిరిగిరాని లోకాలతో బీఆర్‌ఎస్‌లో తర్వాత బాస్ ఎవరనే చర్చ జరుగుతుంది. జెడ్పీటీసీల్లో ఒకరిద్దరు జిల్లా పరిషత్ చైర్మన్ కోసం పోటీ పడుతుండగా, పది మందికి పైగా పార్టీ జిల్లా అధ్యక్షుడి రేసులో ఉన్నారు. జనగామ జిల్లా పరిషత్ చైర్మన్ కుర్చీ కోసం పోటీ ఎక్కువగానే ఉంది. చైర్మన్ మరణంతో నూతన ఎన్నిక ప్రక్రియ అనివార్యమైంది. దీంతో జెడ్పీకి పెద్ద దిక్కు లేకుండా పోయింది. 2018లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని 12 మండలాల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన జెడ్పీటీసీలు విజయం సాధించారు. అప్పట్లో జెడ్పీ చైర్మన్ కోసం ఒకరిద్దరు పోటీ పడగా, ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులైన చిల్పూరు జెడ్పీటీసీ పాగాల సంపత్ రెడ్డి పేరు ఖరారు చేయడంతో అంతా సైలెన్స్ అయ్యారు. అందరినీ కలుపుకుని పోతూ చిన్న చిన్న మనస్పర్థలు మినహా, నాలుగున్నరేళ్ల పాటు తన టీంతో సక్సెస్ సాధించాడు. మధ్యలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్ష పదవి సైతం సంపత్ రెడ్డిని వరించడంతో జోడెద్దుల స్వారీ చేస్తూ.. అందరి మన్ననలు పొందాడు. పాగాల గుండె పోటుతో మరణించడంతో జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి పదవి రెండూ ఖాళీ అయ్యాయి. దీంతో ఈ రెండు పదవులకు పార్టీలో పోటీ ఉందని చెప్పు కోవచ్చు. కాలం గడిచి పోతుండటంతో..మరణించిన వారి జ్ఞాపకాలను నెమర వేసుకోవడం తప్ప.. ప్రస్తుత పదవుల కోసం పోటీ పడక తప్పదు.

జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీ..

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం పది మంది వరకు పోటీ ఉన్నారు. గతంలో ముందు వరుసలో ఉన్న నేతలతో పాటు కొత్తగా ఎగిదిన నాయకులు సైతం అధినేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. దీంతో జిల్లా అధ్యక్ష పదవి రేస్‌లో పోటాపోటీ ఉండే పరిస్థితి నెలకొంది.

స్టేషన్‌ఘన్‌పూర్ వర్సెస్ జనగామ

జిల్లా పరిషత్ రేస్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ వర్సెస్ జనగామ నియోజకవర్గాలు పోటీ పడుతున్నాయి. మరో ఆరు నెలల్లో జెడ్పీ పాలక మండలి పదవీ కాలం ముగుస్తుంది. అయినప్పటికీ జెడ్పీ చైర్మన్ అనిపించుకోవాలనే కుతూహలంతో ఒకరిద్దరు గట్టిగానే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి తమకు అనుకూలంగా మద్దతు కూడగట్టుకునే ఆలోచనలో చేస్తున్నట్లు సమాచారం. అధిష్ఠానం రెండు, మూడె రోజుల్లో జెడ్పీటీసీలతో సమావేశం ఏర్పాటు చేసి, జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుల నియామకాలపై చర్చించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ, సంఖ్యా పరంగా బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉండడంతో.. ఆ పార్టీ ఈ విషయంలో ఎటువంటి జోక్యం చేసుకోవడం లేదు. జనగామ–స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు చెందిన ఓ గులాబీ జెడ్పీటీసీ ఒకరు చైర్మన్ పీఠం ఎక్కనున్నారే చర్చ బలంగా వినిపిస్తుంది. దీనిపై జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి ఇద్దరు త్వరలోనే భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పార్టీలో చర్చ జరుగుతుంది.

మల్లన్నకు సుధావళి వర్ణలేపనం

- 16 వరకు ఐనవోలు ఆలయం మూసివేత
- 17న దృష్టికుంభంతో దర్శనాల పునరుద్ధరణ



ఐనవోలు మల్లన్న గర్భాలయంలో స్వామివారు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో 2024వ సంవత్సరం సంక్రాంతి నుంచి ఉగాది వరకు జరిగే బ్రహ్మోత్సవ జాతరను పురస్కరించుకుని స్వామివారి మూల విరాట్టుకు, అమ్మవార్లకు సుధావళి వర్ణలేపనం(రంగులు అద్దడం) చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దేవాలయంలో సోమవారం(నేటి) నుంచి ఈ నెల 16వ తేదీ వరకు ఆర్జిత సేవలు ఉండవు. ఈ నెల 17న ఉదయం 4 గంటలకు దృష్టికుంభం కార్యక్రమంతో స్వామి, అమ్మవార్ల దర్శనం, ఆర్జిత సేవలు పునరుద్ధరిస్తామని ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రుద్రేశ్వరుడికి లక్షబిల్వార్చన



లక్షబిల్వార్చన అనంతరం స్వామివారిని దర్శించుకుంటున్న శ్రీనివాస్, రోజారాణి దంపతులు

- వేయిస్తంభాల దేవాలయంలో కార్తీక సమారాధన

హన్మకొండ కల్చరల్ : హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి లక్షబిల్వార్చన నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యాన సుప్రభాతసేవ, ఉత్తిష్టగణపతికి 51లీటర్ల ఆవుపాలతో పూర్ణాభిషేకం, రుద్రేశ్వరుడికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం లక్షబిల్వార్చన, మహానివేదన, ద్వాదశహారతి, నీరాజన మంత్రపుష్పం చేపట్టారు. ఆధ్యాత్మికవేత్త తాటిపల్లి శ్రీనివాస్, రోజారాణి దంపతుల సౌజన్యంతో లక్షబిల్వార్చన, కార్తీకసమారాధన జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొని వనభోజనాలు స్వీకరించారు. మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు.

నేడు శ్రీరుద్రేశ్వరీ శ్రీరుద్రేశ్వరస్వామి వార్ల కల్యాణం

సోమవారం మాసశివరాత్రిని పురస్కరించుకుని ఉదయం 4 గంటల నుంచి సామూహిక రుద్రాభిషేకాలు ప్రారంభమవుతాయని, 11 గంటలకు శ్రీరుద్రేశ్వరీ శ్రీరుద్రేశ్వరస్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్నట్లు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

కోయ పూనెం కమిటీ జాతీయ వేదిక చైర్మన్‌గా అరుణ్‌కుమార్



ఎస్‌ఎస్ తాడ్వాయి : సమ్మక్క సారలమ్మ, కోయ పూనెం కమిటీ జాతీయ వేదిక చైర్మన్‌గా మేడారం సమ్మక్క పూజారి సిద్దబోయిన అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం మేడారంలో జాతీయ స్థాయిలో సమ్మక్క, సారలమ్మ జాతర, చరిత్ర అధ్యయనంపై సమావేశం నిర్వహించినట్లు కమిటీ కోఆర్డినేటర్ మైపతి సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ చైర్మన్‌గా సిద్దబోయిన అరుణ్‌కుమార్, వైస్ చైర్మన్‌గా అన్నవరం హన్మంతరావును ఎన్నుకున్నారు. ఈ కమిటీ సమ్మక్క, సారలమ్మ చరిత్రపై జాతీయ స్థాయిలో పరిశోధనలు చేసి పుస్తక రూపంలో అందజేస్తామని సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి నాలుగు రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఆలం ఆనందరావు, వాసం చంద్రశేఖర్, మహారాష్ట్ర నుంచి శంకర్, రమేష్, ఆంధ్రప్రదేశ్ నుంచి పాయం రాజేందర్, వీరబాబు, తెలంగాణ నుంచి పూజారులు సిద్దబోయిన సురేందర్, వసంతరావు, కుర్సం రవి, చందా మహేశ్, సీతక్క యువసేవ జిల్లా అధ్యక్షుడు చెర్ప రవీందర్, సమ్మక్క, సారలమ్మ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ కాక నర్సింగరావు, అర్రెం లచ్చుపటేల్, ఈర్ప సునీల్ హాజరయ్యారు.

వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడిగా దామోదర్



హన్మకొండ: దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడిగా పల్లెపాడు దామోదర్ మరోసారి ఎన్నికయ్యారు. ఈ నెల 9, 10 తేదీల్లో గోవాలోని పనాజీలో దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండకు చెందిన పల్లెపాడు దామోదర్ రెండో సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సాంబరాజు చక్రపాణి, ఉపాధ్యక్షుడిగా మొగిలిచర్ల సుదర్శన్, కార్యదర్శులుగా పి.అనిల్, నల్ల రాజేందర్, సతీష్, రమేష్ రెడ్డి ఎన్నికయ్యారని కన్సూమర్ కోఆర్డినేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జాతీయ అధ్యక్షుడు అనంత్ శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతి పాండ్యా ప్రకటించారు. 2026 డిసెంబర్ వరకు వీరు ఈ పదవుల్లో కొనసాగుతారని వారు వివరించారు.

క్యాంపు కార్యాలయంలో 'నాయిని' ప్రవేశం

- పూర్తి స్థాయిలో ఖాళీ చేయని మాజీ ఎమ్మెల్యే దాస్యం

హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలోకి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రవేశించారు. ఆదివారం మంచిరోజు కావడంతో తల్లి, సతీమణితో కలిసి వచ్చారు. అయితే మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ క్యాంపు కార్యాలయాన్ని పూర్తి స్థాయిలో ఖాళీ చేయలేదు. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు కలిగి ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో క్యాంపు కార్యాలయం, మొదటి అంతస్తులో కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఇదిలా ఉండగా క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన శిలాఫలకాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు తొలగించారని, ఆ పార్టీ జెండాలు కట్టారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించగా.. దీన్ని ఎమ్మెల్యే నాయిని తీవ్రంగా ఖండించారు. ఆర్‌అండ్‌బీ కంట్రోల్‌లో ఉండే ఈ భవనం ఖాళీగా ఉందని సంబంధిత అధికారులు చెప్పడంతో వెళ్లి టెంకాయ కొట్టి గ్రౌండ్ ఫ్లోర్‌లోకి దిగామని, శిలఫలకాన్ని తొలగించాల్సిన అవసరం తమకు లేదన్నారు. ఇదంతా దుష్ప్రచారమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఇద్దరు చిన్న పిల్లలతో ఉంటున్నారని, అంత మానవత్వం లేకుండా ఇక్కడ ఎవరూ లేరని అన్నారు.

కంది..రంది



కంది కాయకు ఆశించిన పురుగు

ప్రస్తుతం పూత, పిందెదశలో పంట ..
- ఈ దశలో తెగుళ్ల పీడ
- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- లేనిపక్షంలో దిగుబడిపై ప్రభావం
- మల్యాల కేవీకే శాస్త్రవేత్తల వెల్లడి

మహబూబాబాద్ రూరల్ : పప్పు ధాన్యాల్లో ప్రధాన పంటగా కంది సాగు అవుతోంది. అలాగే, వివిధ పంటల్లో కూడా అంతర్గతంగా సాగు అవుతోంది. ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉంది. ఈ దశలో పంటను ఆకు చుట్టు పురుగు, కాయ పురుగు ఆశిస్తుంది. ఈ నేపథ్యంలో కంది పంటలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మాలతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.కిశోర్‌కుమార్.. రైతులకు వివరించారు.

ఆకుచుట్టు పురుగు..
- కంది పైరు పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఆకులు, పూతను చుట్టుకుని లోపల ఉండి తింటుంది.
- దీని నివారణకు మెనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు (లేదా) క్వినాల్‌ఫాస్ 20 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాయ తొలుచు పురుగు..
- ఈ పురుగు పూత, పిందె దశలో కాయకు రంధ్రాలు చేసి గింజలు తింటూ ఒక కాయనుంచి మరో కాయకు ఆశిస్తుంది.

సస్యరక్షణ..
- వేసవిలో లోతు దుక్కులు చేస్తే పురుగు కోశస్థ దశలు బయటపడి పక్షులు తినడానికి వీలవుతుంది.
- ఈ పురుగు తక్కువగా ఆశించే పంటలు జొన్న, సోయ, నువ్వు, మినుము పంటలతో పంట మార్పిడి చేయాలి.
- ఖరీఫ్‌లో అంతర్‌పంటగా 7 సాళ్లు, రబీలో అంతర్ పంటగా 3 సాళ్లు పెసర, మినుము వేయడం ద్వారా పరాన్న జీవులను వృద్ధి చేయడానికి తోడ్పడుతాయి.
- పైరు విత్తన 90–100 రోజుల్లో చిగుళ్లను ఒక అడుగు మేర కత్తిరించాలి.
- ఎకరాకు 4 లింగాకర్షణ బుట్టలు అమర్చి పురుగు ఉనికి గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- పురుగులను తినే పక్షులను ఆకర్షించడానికి వీలుగా ఎకరాకు 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
- పురుగు గుడ్లను గమనించిన వెంటనే 5శాతం వేపగింజల కషాయం పిచికారీ చేయాలి.
- బాగా ఎదిగిన పురుగులను ఏరివేయాలి (లేదా) చెట్లను బాగా కుదిపి దుప్పట్లలో పడిన పురుగులను ఏరివేయాలి (లేదా) నాశనం చేయాలి.
- పురుగు ఉధృతిని బట్టి పూత దశలో క్లోరోపైరిపాస్2.5 మిల్లీ లీటర్లు పూత, కాత దశలో క్వినాల్ ఫాస్ 2.0 మిల్లీ లీటర్లు (లేదా)ఎసిఫేట్ 1.5 గ్రాములు (లేదా) ఫైనోసాడ్ 0.3 మిల్లీ లీటర్లు.. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



సదస్సులో పాల్గొన్న ఎన్‌డీసీడబ్ల్యూ ప్రతినిధులు దేవదాస్, మంజు తదితరులు

కాజీపేట రూరల్ : దళిత క్రైస్తవులకు ఎస్సీలుగా గుర్తించాలి.. ఇందుకు కలిసికట్టుగా ఉండి హక్కుల సాధనకు ఉద్యమించాలని దళిత క్రైస్తవ జాతీయ ఉద్యమ నాయకుడు బ్రదర్ జాన్ డానియల్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ దివ్యదీప్తి భవన్‌లో నేషనల్ దళిత్ క్రిస్టియన్ వాచ్(ఎన్‌డీసీడబ్ల్యూ) దక్షిణ భారత రాష్ట్రాల కోఆర్డినేటర్ కుమ్మరి కృష్ణాకర్ ఆధ్వర్యాన ఆదివారం ఏర్పాటు చేసిన కెపాసిటేషన్ ప్రోగ్రాం ముగింపు సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు దళిత క్రిస్టియన్ల సమస్యలు, అవమానాలు, అంటరానితనం, వాటికి గల కారణాల గురించి క్షేత్రస్థాయిలో చర్చించినట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి అనువైన మార్గాలను, భవిష్యత్‌లో అనుసరించాల్సిన ప్రణాళికను రూపొందించినట్లు కృష్ణాకర్ తెలిపారు. సమావేశంలో(ఎన్‌డీసీడబ్ల్యూ) జాతీయ సెక్రెటరీ సిస్టర్ మంజు, జాతీయ దళిత క్రైస్తవ ఉద్యమ చైర్మన్ డాక్టర్ రిచర్డ్ దేవదాస్, సుప్రీం కోర్టు అడ్వకేట్ ఫ్రాంక్లిన్ సీజర్, ఉత్తర భారత కోఆర్డినేటర్ బబ్లురాం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం



ఘటనా స్థలిలో గుమిగూడిన గ్రామస్తులు

మరిపెడ రూరల్: యువకుడిపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తండధర్మారం గ్రామంలో జరిగింది. అదనపు ఎస్సై జీనత్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన కొలకపంగ ఉప్పలయ్య అదే గ్రామానికి చెందిన ఓ వివాహితను కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయంలో బాధితురాలి కుమారుడు.. ఉప్పలయ్య నిలదీసే ప్రయత్నంలో ఘర్షణ జరిగింది. దీంతో ఉప్పలయ్య తన వెంట తెచ్చుకున్న కత్తితో యువకుడిని పొడిచాడు. గమనించిన స్థానికులు ఉప్పలయ్యకు దేహశుద్ధి చేశారు. దీనిపై సమాచారం అందుకున అదనపు ఎస్సై జీనత్ ఘటనా స్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. యువకుడిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

గిరిజన యువతులకు ఉచిత శిక్షణ



ఏటూరునాగారం : ఏటూరునాగారంలోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ.. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతులకు హైదరాబాద్‌లోని నిర్మాణ్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో రెండు నెలలు వెబ్ మొబైల్ అప్లికేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిక్షణ కోర్సుల్లో హెచ్‌టీఎంఎల్, జావా, జావా స్క్రిప్ట్, పీహెచ్‌పీ, సీఎస్ఎస్, బూట్ స్ట్రాప్‌లకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ శిక్షణకు 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయసు ఉండాలన్నారు. ఏదైనా డిగ్రీ, ఆ పైనా ఉత్తీర్ణత కలిగి ఉండడంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధికి చెందిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన గిరిజన నిరుద్యోగ యువతులు తమ విద్య ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 16వ తేదీన జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు ఆయా మండలాలు ఏటూరునాగారం, వాజేడు (వెంకటాపురం నుగూరు) 94903 41911, మంగపేట, కన్నాయిగూడెం, తాడ్వాయి 80089 32159, గోవిందరావుపేట, ములుగు, వెంకటాపూర్ (రామప్ప) 79816 33716 నంబర్లలో సంప్రదించాలని పీఓ పేర్కొన్నారు.

ఓట్లు వేయలేదని..

- చిల్పూరులో వీధి దీపాల తొలగింపు
- చీకట్లో గుట్టకింద అంగడి
- విచారణ చేపట్టి న్యాయం చేయాలని గ్రామస్తుల డిమాండ్



స్తంభాల నుంచి తొలిగించిన లైట్లు

చిల్పూరు: శాసనసభ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు వేయలేదనే కోపంతో జనగామ జిల్లా చిల్పూరులోని గుట్టకింద అంగడిలో స్తంభాలకు వీధి దీపాలు లేకుండా తొలగించారని, చీకట్లో ఉండాల్సి వస్తున్నదని స్థానికులు వాపోయారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పంతం రాజు, తొటి సునీల్, గొల్లపల్లి వాసు, ఎల్లస్వామి, సారయ్య, హరికృష్ణ, సాంబరాజు, జమ్మయ్య, రాకేష్ ఆదివారం మాట్లాడుతూ శుక్రవారం రాత్రి వరకు బర్రెంకల చెరువు నుంచి చిల్పూరు గుట్ట అంగడి, ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ వరకు స్తంభాలన్నింటికీ వీధి దీపాలు వెలిగాయని, శనివారం కాంట్రాక్టర్లు వచ్చి లైట్లను తొలగిస్తుండగా గ్రామస్తులు అడ్డుకోగా.. సర్పంచ్, కార్యదర్శి తొలగించమన్నారని తెలిపినట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎలుగుబంట్ల భయం ఉంది.. స్థానికులతోపాటు దేవస్థానానికి వచ్చే భక్తులు ఉంటారు.. సర్పంచ్‌తో మాట్లాడతామని చెప్పినా వినిపించుకోకుండా తొలగించారని వాపోయారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అదనపు దీపాలే తీసివేశాం: కార్యదర్శి

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అజీజ్‌పాషాను వివరణ అడగగా.. రాజకీయాల గురించి తమకు అవసరం లేదని, కాంట్రాక్టర్లు అదనంగా వేసిన 70 లైట్లు తొలిగించాలని చెప్పామని తెలిపారు. మొత్తం తీసివేసిన విషయం తెలియదని పేర్కొన్నారు. నేడు పరిశీలించి వేయిస్తామని పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి మృతి

- పంచరాయి తండాలో ఘటన



చందునాయక్ (ఫైల్)

తరిగొప్పుల : ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని జాలుబాయి తండా శివారు పంచరాయి తండాలో జరిగింది. ఎస్సై రమేష్ కథనం ప్రకారం మండలంలోని మాన్సింగ్ తండా శివారు బాలక్యబిక్యా తండాకు చెందిన భూక్యా చందునాయక్ (28).. జాలుబాయి తండాకు చెందిన తన బావ సభావత్ తిరుపతికి చెందిన ట్రాక్టర్‌ను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మరమ్మతు చేయించుకుని తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో జాలుబాయి తండా నుంచి తన స్వగ్రామం వస్తున్న క్రమంలో అదే తండా శివారు పంచరాయి తండాలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న చందు నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు చందును జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య జ్యోతి, పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మైలారంలో మరొకరు..



మధుసూదన్ రెడ్డి మృతదేహం

శాయంపేట : ధాన్యం తరలిస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మైలారంలో జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన వైద్యుల మధుసూదన్ రెడ్డి(45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన కుక్కల సుధాకర్, సారయ్య పొలం నుంచి ధాన్యం తరలిస్తున్నాడు. ఈ క్రమంలో కోలుకుంట కట్ట మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి కిందపడింది. దీంతో మధుసూదన్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు..



వినీత్(ఫైల్)

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలోని అన్నారం క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా బైక్‌పై వెళ్తున్న యువకుడు శీలం వినీత్(21) మృతి చెందాడు. అతని వెంట ఉన్న మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కాళేశ్వరం నుంచి మహదేవపూర్ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వినీత్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడుకి తీవ్రగాయాలు కాగా పోలీసులు మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై లక్ష్మణ్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

- కుమారులకు తీవ్ర గాయాలు



సత్తయ్య మృతదేహం



క్షతగాత్రుడు వెంకటేశ్

లింగాలఘణపురం : జనగామ–సూర్యాపేట రోడ్డు నెల్లుట్ల బ్రిడ్జిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తండ్రి మృతి చెందగా ఇద్దరు కుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లుట్లకు చెందిన రైతు పేరబోయిన సత్తయ్య(70) వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు తలకు గాయమైంది. దీంతో అతని కుమారులు శ్రీనువాసు, వెంకటేశ్ తమ బైక్‌పై మధ్యలో కూర్చోబెట్టుకొని జనగామ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. జనగామ నుంచి సూర్యాపేటకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సత్తయ్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనువాసు, వెంకటేశ్‌కు కాళ్లు విరగడంతో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దత్తాత్రేయను కలిసిన మౌంటైనర్ యశ్వంత్



పుష్పగుచ్ఛం అందజేసి యశ్వంత్‌ను అభినందిస్తున్న దత్తాత్రేయ

మరిపెడ రూరల్ : హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యా తండాకు చెందిన మౌంటైనర్ భూక్యా యశ్వంత్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. యశ్వంత్ ఇటీవల ఆస్ట్రేలియాలోని ఎత్తైన కోజిస్కోను అధిరోహించి పర్వత శిఖరంపై జాతీయ పతకాన్ని ఎగురవేశాడు. ఈ విషయం తెలుసుకున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ యశ్వంత్‌ను తన నివాసానికి ఆహ్వానించి పుష్పగుచ్ఛంతో అభినందించారు. అనంతరం గతంలో అధిరోహించిన పర్వత శ్రేణుల గురించి యశ్వంత్‌ను అడిగి తెలుసుకున్నారు. యశ్వంత్ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పర్వత శిఖరాలపై ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఎంతో అమోఘమని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని యశ్వంత్‌కు సూచించారు.

గేదెకు రెండు దూడలు జననం



గేదకు జన్మించిన కవల దూడలు

దంతాలపల్లి : ఒకే ఈతలో గేదెకు రెండు దూడలు జన్మించిన అరుదైన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన రైతు పచ్చిపాల సంజీవకు చెందిన గేదె రెండు ఆడ దూడలకు జన్మిచ్చింది. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి వినోద్ కుమార్, ఉపకేంద్రం పశువైద్యాధికారి వరలక్ష్మి దూడలకు పరీక్షలు నిర్వహించి అవి ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. గతేడాది కూడా మండలకేంద్రానికి చెందిన రైతు చిమ్ముల కృష్ణారెడ్డి గేదెకు కృత్రిమ గర్భాధారణ చేయగా ఒక ఆడ, ఒక మగ దూడలు జన్మించాయని అవి ఆరోగ్యంగా ఉన్నాయన్నారు.

రేపటి నుంచి తపాలా ఉద్యోగుల సమ్మె



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ : తమ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ మంగళవారం నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి జయరాజ్ తెలిపారు. హనుమకొండలోని ప్రధాన తపాలా కార్యాలయం ఆవరణలో ఆదివారం సమ్మె వాల్‌పోస్టర్లను సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరి అవలంబిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్న పోస్టల్ ఉద్యోగుల పట్ల పూర్తిగా వివక్ష చూపుతోందన్నారు. కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, తపాలా శాఖ ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కమలేష్‌చంద్ర సిఫార్సును అమలు చేయాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మర్రి కొమురా రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.పట్టాభిరామయ్య, హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు, నాయకులు టి.రజనీకాంత్, ఉదయ్ పవన్, కె.సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పోటు.. పంటకు చేటు

మొక్కజొన్నను ఆశిస్తున్న పురుగు
- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- లేనిపక్షంలో దిగుబడులపై తీవ్ర ప్రభావం
- వ్యవసాయ విస్తరణ అధికారి వెల్లడి



మొక్కజొన్న పంటను తినేసిన కత్తెర పురుగు



వినయ్‌కుమార్

చెన్నారావుపేట : వరంగల్ జిల్లాలో ఈ సంవత్సరం విదేశీ జాతి పురుగుల బెడద ఎక్కువైంది. వీటి ప్రభావంతో పంటలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పంటలు ఆశించిన విదేశీ జాతి పురుగుల్లో కత్తెర పురుగు(ఫాల్ ఆర్మీవామ్) ప్రధానమైంది. మిగతా పంటలపై కూడా దీని ప్రభావం ఉన్నా మొక్కజొన్న పంటపై మాత్రం తీవ్రంగా ఉంది. ఈ పురుగు కొంత కాలంగా పైరును ఆశించి నష్టం చేస్తుంది. ఈ నేపథ్యంలో పురుగు నివారణపై వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) ఓదెల వినయ్ రైతులకు పలు సూచనలు చేశారు. పురుగు నివారణపై ఏమాత్రం అశ్రద్ధ వహించిన దిగుబడులపై తీవ్ర ప్రభావం తప్పదని తెలిపారు. వరి పంటతో పాటు ఇతర కూరగాయల పంటలను కూడా ఆశించే పరిస్థితి ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ ఈ పురుగును నివారించుకోవాలని తెలిపారు.

విదేశీ జాతి లద్దెపురుగు..

ఈ పురుగు విదేశీ జాతి విధ్వంసకర లద్దె పురుగు. మొక్కజొన్నపైరులో ఆకులు మొవ్వను కోసి పారేసినట్లు నమిలేస్తున్న కొత్త రకం చీడపురుగు ఇది. అందుకే దీనిని కత్తెర పురుగు అంటారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ పురుగు రైతులకు సవాల్‌గా మారింది. ఈ పురుగు గతంలో ఎక్కువ విదేశాలలో కనిపించేది.

ఇతర పంటలకు కూడా..

కత్తెర పురుగుగా పిలుస్తున్న లద్దె పురుగు మొక్కజొన్న పంటనే కాకుండా 100 రకాల పంటలను ఆశిస్తుంది. అయితే మొక్కజొన్న మొవ్వ తీపిగా ఉండడం, పగలు ఎండ నుంచి రక్షించుకునేందుకు వీలుగా ఉండడంతో ఈ పంటపైనే ఈ పురుగు దాడి చేస్తుంది. ఈ పంట నాశనం పూర్తయిన తర్వాత వరి పంటను కూడా ఆశిస్తుంది. మొక్కజొన్న తర్వాత వరి పంట అందుబాటులో లేకపోతే కూరగాయల పంటలు ప్రధానంగా..క్యాబేజీ పంటను ఆశిస్తుంది. నష్ట తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో రైతులు ఈ పురుగును ప్రాథమిక దశలో గుర్తించి నివారించుకోవడం మంచిది. ఆలస్యమయ్యే కొద్దీ దీని బెడద తీవ్రంగా ఉంటుంది.

లింగాకర్షక బుట్టలతో గుర్తించొచ్చు

పంట మార్పిడి విధానం పాటించడం, అదునులో విత్తు వేయడం ద్వారా పురుగు ఉధృతిని కొంత మేర తగ్గించొచ్చు. లద్దెపురుగు గుడ్లు, లార్వాలు కనిపిస్తే వాటిని నాశనం చేయాలి. ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు పెట్టి పురుగు ఉనికిని గుర్తించాలి. తర్వాత నివారణ చర్యలు చేపట్టాలి. పంటలో కలుపు మొక్కలు ఉండకుండా తొలగించుకోవాలి.

ఒకే రోజులో 120 కి.మీ ప్రయాణం

ఈ పురుగు రోజుకు రాత్రి వేళ 100 నుంచి 120 కిలో మీటర్ల మేర ప్రయాణిస్తుంది. వాతావరణ పరిస్థితులను బట్టి నెల నుంచి మూడు నెలల వరకు జీవిస్తుంది. ఒక్కొక్క రెక్కల పురుగు 900–1800 వరకు గుడ్లు పెడుతుంది. వాటి నుంచి వచ్చే లార్వాలు మొక్కజొన్న ఆకులు, కాండంపై పెరుగుతూ పైరును పూర్తిగా తింటాయి.

నివారణ చర్యలు..

వేప నూనె 1500 పీపీఎం ఒక లీటర్ నీటికి 5 ఎంఎల్ కలుపుకుని మొదటి దశలో ఉన్న పంటకు పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లాంబ్డ సైహలోత్రిన్ 1 మిల్లీ లీటర్ నీటిలో కలిపి మొక్క జొన్న సుడులలో పిచికారీ చేయాలి.

విషపు ఎరలు తయారు చేసుకోవాలి..

విషపు ఎరలను తయారు చేసుకుని పురుగును నివారించాలి. 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం, 2–3 లీటర్ల నీటి మిశ్రమాన్ని 24 గంటలు పులియబెట్టాలి. దీనికి 100 గ్రాముల తయోడి కార్బ్ మందును వాడి అరగంట ముందు కలుపుకుని విషపు ఎరలను మొక్కజొన్న సుడుల్లో వేయాలి. ఉధృతి అధికంగా ఉంటే ఇమామిక్టిన్ బెంజాయేట్ మందును లీటర్ నీటికి 0.4 మి.లీ ప్రకారం సుడులు తడిచేలా పిచికారీ చేయాలి. పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు 8–10 ఎకరానికి మొక్కజొన్న చేనులో ఫీట్ ఎత్తులో నాటుకుని పురుగు ఉధృతి తెలుసుకుని మందు పిచికారీ చేయాలి.